
సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 10 । ఆగస్టు । 2023



వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరప్రసాదిని..

తాగు,సాగునీరందించే వరప్రసాదినిలా వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మారిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. -8లో..



ఒక్క మాత్రతో నులిమేద్దాం..

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.960	రూ.1040
రెండోరకం	రూ.800	రూ.940

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 351 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	532
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 223.580 కిలోలు

న్యూస్‌రీల్

ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్‌ఓ, డీవైఈఓ, సైన్సు ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తులు చేయాలని జిల్లా సైన్సు అధికారి ఓబుల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి సైన్సు ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనక్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 31వతేదీలోపు నామినేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్లు తప్పకుండా చేయించాలన్నారు. రేడీమేడ్ నమూనాలను అనుమతించమని స్పష్టం చేశారు. చిన్నారుల మది నుంచి వచ్చిన ఆలోచనలను కార్యరూపం దాల్చేవిధంగా ఉండే వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శనకు ఎంపిక చేయాలని సూచించారు. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా,మేకిన్ ఇండియా, స్వస్థభారత్, స్వచ్ఛభారత్ అనే ప్రధాన అంశాలతో తయారు చేయాలన్నారు. డివైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓలు ప్రభాకరెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, డివిజన్ రిసోర్సుపర్సన్ భాస్కరన్, శాస్త్రి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనుష్‌ను విజయవంతం చేద్దాం



ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న భవానీ, వైద్యాధికారిణి సృజన

నందలూరు(రాజంపేట): మిషన్ ఇంద్ర దనుష్‌ను విజయవంతం చేద్దామని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్ష అధికారిణి డా.భవానీ పిలుపునిచ్చారు. బుధవారం దుర్గాపురం, నందలూరు హరిజనవాడ, నాగిరెడ్డిపల్లె ప్రాంతాల్లో స్థానిక వైద్యాధికారిణితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్‌ను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికి ఏదేని కారణాల వల్ల వేయలేకపోయిన టీకాలు ఈ వారంలోపు ఉచితంగా అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌వో నారాయణ పాల్గొన్నారు.

రేపు సఫాయి కర్మచారీస్ చైర్మన్ రాక

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ సఫాయి కర్మచారీస్ చైర్మన్ వెంకటేశన్ ఈ నెల 11 జిల్లా పర్య టనకు వస్తున్నారని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అగస్టు 11న ఉద యం 10.25 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 11.25 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సఫాయి కర్మచారుల సమావేశం లో పాల్గొంటారని తెలిపారు. రాత్రికి కడపలో బస చేస్తారన్నారు. మరుసటిరోజు ఉదయం 9 గంటలకు కడప నుంచి అన్నమయ్య జిల్లాకు వెళతారన్నారు.

బీఎల్‌ఏల నియామకంలో పార్టీలు ముందుకు రావాలి

రాయచోటి: రాజకీయ పార్టీలన్నీ బీఎల్‌ఏలను త్వరగా నియమించాలని, అలాగే ఓటర్లకు అవగాహన కల్పించేందుకు సహకరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ, బీఎల్‌ఏల నియామకం, ఓటర్ల ధృవీకరణ తదితర అంశాల మీద వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేకుండా ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేయడానికి రాజ కీయ పార్టీ ప్రతినిధుల సహకారం అవసరమని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఓటర్ల మార్పులు, చేర్పుల వివరాల జాబితా ఇప్పటికే రాజకీయ పార్టీలన్నింటికీ ఇచ్చామన్నారు. పోలింగ్ బూతుల హేతుబద్ధీకరణపై ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఓబులవారిపల్లిలో ఓటర్ల జాబితాను స్వ యంగా తనిఖీ చేసినప్పుడు చాలా మంది ఓటర్లు ఓటర్ ఐడీ ఉండి కూడా ఫామ్ 6ను ఇస్తున్నారని ఇలాంటివి జరగకుండా చూసేందుకు రాజకీయ పార్టీ లు సహకరించాలన్నారు. జాబితా తయారీలో వలంటీర్లను ఉపయోగించుకుంటున్నారా అని అడగ్గా అటువంటిదేమీ లేదని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఈఆర్‌ఓలకు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా తయారీలో వివిధ సూచనలను చేశారు. జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీవోలు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ..
బడి అభివృద్ధికి దివిటీ

నాడు టీడీపీ పాలనలో ప్రభుత్వ బడుల అభివృద్ధిపై పట్టించుకున్న దాఖలాలు లేవు. విద్యార్థుల ప్రగతిని తెలియజేసేందుకు తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు ఊసేలేదు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో అన్న విషయాలు తల్లిదండ్రులు తెలుసుకునే పరిస్థితి ఉండేదే కాదు. ఇక బడుల బలోపేతమంటారా.. అది ప్రకటనలకే పరిమితమైంది.

నేడు ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చింది. బడుల బలోపేతానికి నాడు–నేడు కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేల కోట్లను ఖర్చు చేస్తోంది. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేసేందుకు నాలుగేళ్లుగా తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ విద్యా సంవత్సరమూ పేరెంట్స్.టీచర్స్ మీటింగ్ నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం
- పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- నేడు ప్రభుత్వ బడుల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

మదనపల్లె సిటీ: పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీలు కీలక పాత్రపోషిస్తున్నాయి. బోధనాభ్యాసన భాగస్వామ్యులను చేస్తూ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల అభ్యర్థన సామర్థ్యాలను తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 10న పేరెంట్స్,టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల, విద్యార్థుల సమస్యలు, లోపాలు ఉంటే సరిదిద్దుకునేందుకు ఈ



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

సమావేశాలు మేలు చేకూర్చనున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా 2,213 ప్రభుత్వ బడులున్నాయి. ఇందులో 1,54,789 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 10న పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రతి పాఠశాలల్లో కచ్చితంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం అందజేసి సమావేశాలను నిర్వహించి సూచనలు, సలహాలను తీసుకోవాలని ఆదేశించారు.

సూచనలు ఇలా...

- సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలి.
- హెచ్‌ఎం పర్యవేక్షణలో క్లాస్‌టీచర్, పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి.
- విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపి సలహాలు అందించాలి.
- పురోగతి, హాజరు, పిల్లల ప్రవర్తన, మూల్యాంకనం ఇతర అంశాలను తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులతో చర్చించాలి.
- చర్చించిన అంశాలను హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు (తరగతి టీచర్) రికార్డు చేసి మినిట్స్ తయారు చేయాలి.
- తయారు చేసిన అంశాలను ఎంఈవో, డీఈవోకు పంపించాలి.

కలిగే ప్రయోజనాలు

- పాఠశాలలో సమాజం, విద్యార్థుల తల్లిదండ్రులతో అనుసంధానికి దోహదం చేస్తుంది.
- విద్యార్థుల పురోగతిపై క్రమం తప్పకుండా చర్చలు జరపడం వల్ల వారికి అందించాల్సిన సహకారం, రోజువారీ ఇంటి పనులు, పాఠ్యపుస్తకాల వినియోగం తదితరాలను తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- పాఠశాల అభివృద్ధి, విద్యాపరమైన పురోగతిలో తల్లిదండ్రులు భాగస్వాములవుతారు.
- పిల్లల హాజరు, ప్రవర్తనా సమస్యలు, ఆసక్తులు పరస్పరం గ్రహించే వీలుంటుంది.
- పిల్లల చదువు, పరీక్ష ఫలితాలు తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనం అమలు తీరును తల్లిదండ్రులు స్వయంగా పర్యవేక్షించవచ్చు.
- దీంతో నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

అందరి భాగస్వామ్యం ఉండాలి



బంగారు భవిష్యత్‌కు దారి చూపే పాఠశాలల్లో అందరి భాగస్వామ్యం ఉంటేనే అభివృద్ధి సాధ్యం ప్రభుత్వం అమలు చేస్తున్న పేరెంట్స్,టీచర్స్ కమిటీలతో అందరూ భాగస్వాములవుతారు. ఇది వినూత్నమైన కార్యక్రమం. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచనలు ఇచ్చాం. సమావేశ నిర్వహణలో మినిట్స్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలి. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవు.

–శ్రీరామ పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

ప్రభుత్వ నిర్ణయం చాలా మంచిది



నా కుమారుడు కెల్విన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థుల చదువు, వారి భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. నెలకోసారి పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయడంతో విద్యార్థుల చదువుతో పాటు ఇతర విషయాలను తెలుసుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవచ్చు.

–కె.ప్రియదర్శిని, పేరెంట్స్ కమిటీ చైర్మన్, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

రేపు రాజంపేటలో జాబ్‌మేళా

రాజంపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న న్యాక్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ప్రతిభగల అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఏదేని డిగ్రీ, ఏదేని పీజీ, ఐటీఐ, డిప్లొమా, నర్సింగ్ వంటి కోర్సులు ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్లలోపు వారు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు WWW.aprrdc.in వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8897776368, 7093618420 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్

- జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్



రాజంపేట రూరల్: రైతులు సాగు చేసిన పంటలను గురువారం నుంచి ఈ క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు ఈకేవైసీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ ఆర్‌బీకే అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఎర్రబల్లిలో గల అగ్రీ ల్యాబ్‌లో బుధవారం ఆర్‌బీకే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ ద్వారా రైతులందరికీ రూ.6వేలు పొందడానికి తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. ఆర్‌బీకేల ద్వారా పరిక్ష చేసి నాణ్యమైన ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు రైతులకు అందజేయాలని కోరారు. ప్రతి మండలంలో 3 కియోస్కలను 50శాతం రాయితీతో రైతు గ్రూపులను ఏర్పాటు చేసి అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులందరికీ తప్పని సరిగా సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలని ఆదేశించారు. రాజంపేట వ్యవసాయ సంచాలకులు జీ రమేష్‌బాబు, వ్యవసాయ అదికారులు, పెనగలూరు, నందలూరు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్, జేసీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ ఆదివాసీలు బాగా చదివి విద్యావంతులు కావాలన్నారు. తమ దృష్టికి వచ్చిన గిరిజనుల సమస్యలన్నీ వందశాతం పరిష్కరించేందు కు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాల దాదాపు 4వేల మందికి భూ పంపిణీ చేశామన్నారు. ఇందులో 450 దాకా ఎస్టీ కుటుంబాలు ఉన్నారని తెలిపారు. వివిధ గిరిజన నాయకులు వివిధ అంశాలపై సమావేశంలో వివరించారు. అనంతరం పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన గిరిజన విద్యార్థులకు మెమెంటోలను బహుకరించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అబ్సలోమ్ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణపై సమీక్ష

జిల్లాలోని ముదివేడు రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ అవార్డ్స్ వేగంగా పూర్తి చేయడంతో పాటు సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముదివేడు లిఫ్ట ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల అంశాలపై అధికారులతో సమీక్ష చేశారు. ముదివేడు రిజర్వాయర్‌కి సంబంధించి 425 ఎకరాలు భూసేకరణ చేసి అవార్డు పాస్ చేశామని..



పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన గిరిజన విద్యార్థులకు మెమెంటోలను బహుకరిస్తున్నకలెక్టర్ గిరీషా పీఎస్

లబ్దిదారులకు త్వరగా పరిహారం పంపిణీ చేయాలన్నారు

జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు దోహదం: జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని, ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జె నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టు సమస్యలపై దృష్టి సారించాలి

జిల్లాలో రిజర్వు ఫారెస్టు సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ రిజర్వు ఫారెస్టు అంశాలపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిట్వేలి మండలంలోని నగిరిపాడు పంచాయతీ పెద్దూరు, చెర్లోపల్లి, అలాగే వీరబల్లి మండలం షికారుపాలెంకు చెందిన గిరిజనులు అనుభవంలో ఉన్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆయా మండలంలో గిరిజనుల స్థితిగతులు, వారు సాగుచేస్తున్న అటవీ భూమి విస్తీర్ణం తదితరాలను పరిశీలించాలని తహశీల్దార్లను ఆదేశించారు.

పండగలా 'నా భూమి–నా దేశం'

చిన్నమండెం: అందరం కలిసికట్టుగా దేశ అభివృద్ధికి భాగస్వాములు అవుతామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం కేశాపురంలో 'నా భూమి–నా దేశం నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండగ వాతావరణంలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే 25 ఏళ్లలో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చు తీసుకురావడానికి కృషి చేయాలని దేశ ప్రధాని, సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారన్నారు. ఆ దిశగా మనమందరం కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డ్వామా పీడీ మద్దిలేటి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీ రెడ్డప్ప, సర్పంచ్ మంజుల, జేసీఎస్ మండల ఇంచార్జ్ అంజనప్ప, తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీఓ రహీం తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు పెళ్లి కానుక



రూ.2.96 కోట్ల విలువైన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్సీ, మునిసిపల్‌చైర్మన్

- అన్నమయ్య జిల్లాలో 333 మందికి కళ్యాణమస్తు, షాదీతోఫా కింద రూ.2.96 కోట్ల నగదు జమ
- కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : దేశంలో ఎక్కడా లేని విధంగా పేద కుటుంబాల్లోని ఆడ బిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీతోఫా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో వైఎస్ ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీతోఫా కింద 2023 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న 18,883 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.14.1.56 కోట్ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాకు సంబంధించి 333 మంది జంటలకు రూ.2.96 కోట్ల లబ్ధి చేకూరింది. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టీచర్స్ ఎంఎల్సీ ఎం.రామచంద్రారెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించడం, ప్రతి చెల్లెమ్మను, ప్రతి తమ్ముడిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం, పేదకుటుంబాలలోని వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీతోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లాలోని 333 మందికి రూ.2.96 కోట్ల విలువైన మెగాచెక్కును కలెక్టర్, జేసీ, ఎమ్మెల్సీ, మునిసిపల్ చైర్మన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

షాదీతోఫా ఆదుకుంది



పేద కుటుంబాలలో పెళ్లి వేడుక అంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి. మాలాంటి వాళ్లను ఆదుకోవడానికి జగనన్న ప్రభుత్వం షాదీతోఫా కింద ఆర్థికంగా అండగా నిలబడుతోంది. పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

–షేక్ ఆస్మా, కొత్తపల్లి, రాయచోటి

క్లుప్తంగా

వ్యవసాయ మోటార్లు, వైర్లు చోరీ

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పలువురు రైతుల వ్యవసాయ బోర్లకు అమర్చిన వ్యవసాయ పనిముట్లు, మోటార్ వైర్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుని వెళ్లారు. అలాగే ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు తాగునీరు సరఫరా చేసే బోరుబావికి విద్యుత్ సరఫరా చేసే వైర్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

వైర్లు, పైపుల చోరీపై కేసు నమోదు

కలకడ : మండలంలోని మూడు గ్రామాల్లో కేబుల్‌వైర్లు, పైపుల చోరీలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు మూడు రోజుల క్రితం మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ ఎగువబట్టావారిపల్లెకు చెందిన రామమోహన్, వెంకట్రమణనాయుడు, సునీల్‌కుమార్‌ల బావివద్ద కేబుల్‌వైర్, రూ.84,600 విలువ చేసే 360 మీటర్ల వైర్లు చోరీకి గురయ్యాయి. అలాగే కోన పంచాయతీ పరిధిలోని కటారి రమణకు చెందిన నర్సరీ ఏర్పాటుకు వినియోగించే ఇనుపపైపులు, రేకులు కూడా మంగళవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బుధవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క వీరంగం

– పలువురికి తీవ్రగాయాలు

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. పొన్నేటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెలో ఓ పిచ్చికుక్క వీరంగం సృష్టించి కనపడిన వారందరినీ వెంటపడి కరిచి గాయాలపాలు చేసింది. పిచ్చికుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన పలువురు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చారు. వారిలో సాయిగోపాల్‌రెడ్డి, కృష్ణమ్మ, పవన్, రామిరెడ్డి, పావని, సుధాకర్ తదితరులు ఉన్నారు. కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం

- చిన్నారుల్లో రక్తహీనత కలిగిస్తున్న నులి పురుగులు
- నేడు నులి పురుగుల నిర్మూలన దినోత్సవం
- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లాలో 19 ఏళ్లలోపువారు 4,00,234 మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


డీవార్మింగ్ డే పోస్టర్

జిల్లా సమాచారం

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
అంగన్‌వాడీలు	2260	86,369
ప్రభుత్వ పాఠశాలలు	2192	1,62,602
ప్రైవేటు పాఠశాలలు	345	1,04,842
కాలేజీలు	**సంఖ్య**	**విద్యార్థులు**
జూనియర్ కాలేజీలు	64	13,536
ప్రైవేటు జూనియర్ కాలేజీలు	46	16,590
పాలిటెక్నిక్	8	1891
ఐటీఐలు	9	1309
ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు	14	2560
ప్రైవేటు డిగ్రీ కాలేజీలు	33	8385
బడిబయట పిల్లలు	2150	

మదనపల్లె సిటీ : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా జిల్లాలో అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నులిపురుగుల కారణంగా పిల్లలను ,గర్భిణులను రక్తహీనత పీడిస్తోంది. ఇందుకు అపరిశుభ్రతే కారణం. పరిశుభ్రత, అవగాహనతో నులిపురుగులను నివారించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. జిల్లాలో 30 మండలాల్లో 19 ఏళ్లలోపు వయసున్నవారు 4,00,234 మంది పిల్లలున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను నియమించారు. విద్యాశాఖ, ఐసీడీఎస్‌ను సైతం భాగస్వామ్యం చేశారు. వీరి ద్వారా అందించేందుకు ముందుగానే మాత్రలు సిద్ధం చేశారు.

మాత్రల పంపిణీ ఇలా...

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలను అందించనుంది. ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్ల నిండి 19 ఏళ్లలోపు ఉన్న వారికి స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయస్సున్న చిన్నారులు 200 మిల్లీగ్రాముల (అర్ధ) మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు వారు 400 మిల్లీగ్రాములు చొప్పున మింగాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యం వద్దు

నులిపురుగుల నిర్మూలన మాత్రలు మింగడంలో నిర్లక్ష్యం వద్దు. విధిగా వైద్య బృందం, పాఠశాల బృందం మాత్రలు పంపిణీ చేయాలి. భోజనం తర్వాత దగ్గరుండి మింగించాలి. అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీ చేశాం. కచ్చితంగా ప్రతి పిల్లవాడు ఈ మాత్రలు వేసుకోవాలి. నులి పురుగుల నిర్మూలనకు తల్లిదండ్రులు సహకరించాలి.

– కొండయ్య, డీఎంహెచ్‌ఓ, అన్నమయ్య జిల్లా.

ఎస్‌ఈబీ స్పెషల్‌డ్రైవ్‌లో నలుగురి అరెస్ట్


సారా తయారీదారుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

మదనపల్లె : అన్నమయ్య జిల్లా ఏఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమ నాటుసారా తయారీ, అమ్మకాలు, కర్ణాటక మద్యం అరికట్టేందుకు బుధవారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె తాండాలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న బుక్యా రవినాయక్(32), మూడే మునిలాలమ్మ(31)లను అరెస్ట్ చేసి వారి నుంచి 35 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సారా రవాణాకు వినియోగిస్తున్న ఆపే ఆటోను సీజ్ చేశామన్నారు. వీరి నుంచి నాటుసారా కొనుగోలు చేసి పట్టణంలో అమ్మకాలు సాగించే ఈశ్వరమ్మకాలనీకి చెందిన అంజినాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు. తర్వాత రామసముద్రం మండలం మినికి హరిజనవాడకు చెందిన డేగల్ల హనుమప్ప(47) నుంచి 196 మద్యం ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ(90ఎం.ఎల్) టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు కేసుల్లోని నలుగురు నిందితులను మదనపల్లె మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిస్తే ఆయన 14 రోజులు రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

ఒరిస్సాకు చెందిన క్వారీ కార్మికుడు మృతి

మదనపల్లె : ఒరిస్సాకు చెందిన క్వారీ కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం రామసముద్రం మండలంలో జరిగింది. ఒరిస్సా రంజామా జిల్లాకు చెందిన జైత్యానాయక్ కుమారుడు ప్రదీప్‌నాయక్(25) రామసముద్రం మండలం పైగడ్డ సమీపంలోని క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా క్వారీలో పనిచేస్తుండగా, ఇతనిపై ప్రమాదవశాత్తు బరువైన పైపు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సహచర కార్మికులు బాధితుడిని మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో పీలేరు వద్ద మృతి చెందాడు. రామసముద్రం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర ప్రసాదినిలా

వైఎస్సార్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్


కుడి కాలువకు పూజ చేసి టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : తాగునీరు, సాగురు అందించే వరప్రసాదినిలా వైఎస్సార్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మారిందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కుడికాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా దేవుడి దయతో సకాలంలో వర్షాలు కురవడంతో కాలువల ద్వారా నీటి విడుదల చేసే అవసరం రాలేదన్నారు. ఈ ఏడాది వర్షాలు కొంచెం ఆలస్యం కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే సంకల్పంతో కుడి కాలువలో ఏర్పడ్డ పూడికలు, చిన్న చిన్న మరమ్మతులను ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే సమయంలో సకాలంలో రైతులకు సాగు నీటిని అందించేందుకు ముందు చూపుతో నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్

రాయచోటిటౌన్ : మహిళలు స్వశక్తితో ఎదగాలని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ అన్నారు. రాయచోటిలోని పాలిటెక్నిక్‌లో సున్నితత్వం , బాల్యవివాహాలు, మహిళా సాధికారత అనే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కుటుంబం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ముందుగా ఆ కుటుంబంలోని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. బాల్య వివాహాలను అందరూ కలసి కట్టుగా నిర్మూలించాలని చెప్పారు. అనంతరం జిల్లా బాలల రక్షణ అధికారి సుభాష్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించేందుకు అధికార యంత్రాంగం శాయశక్తులా కృషి చేస్తోందన్నారు. గుడ్ నైబర్స్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పి. శివశంకర్, సిబ్బంది సుధానిధి, మైథిలీ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వంద కుటుంబాలు చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : చిట్వేలి మండలం కేవీపురం గ్రామానికి చెందిన వంద టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎల్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఎంపీపీ చంద్ర, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


మృతుడు సన్నీ (ఫైల్)

చిట్వేలి/రాజంపేట : రెల్వేకోడూరు–చిట్వేలి రోడ్డులో గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిడిపాటి సన్నీ (23) బుధవారం మృతి చెందాడు. బైకుపై వెళుతున్న సన్నీని టెంపో వాహనం(ఏపీ 39యుఎస్–8693) డ్రైవర్ అజాగ్రతగా నడిపి ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిట్వేలి కేఎస్ అగ్రహారానికి చెందిన తమిడిపాటి గంగాధరం, దేవి దంపతుల పెద్దకొడుకు సన్నీ. ఇటీవల మృతుని తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లారు. కువైట్ నుంచి వచ్చిన తర్వాత మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు చిట్వేలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్యే సంతాపం

చిట్వేలి కేఎస్ అగ్రహారం దళితవాడలో బలమైన వర్గం కలిగిన తమిడిపాటి కుటుంబానికి చెందిన యువకుడు మృతి చెందడంతో రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో సన్నీని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కానీ చివరికి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు.


కొండాపురంలో చెల్లని చెక్కు కలకలం

కొండాపురం : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకులో ఓ చెల్లని చెక్కు కలకలం రేపిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆలస్యంగా అందిన సమాచారం మేరకు.. మంగళవారం కొండాపురంలోని స్టేట్‌బ్యాంకుకు ఓ వ్యక్తి వచ్చి తన వద్ద ఉన్న బ్లాంకు చెక్కును అధికారులకు చూపి ఈ అకౌంటులో రూ.40 కోట్లు ఉన్నాయేమో పరిశీలించమని కోరాడు. అంత పెద్ద మొత్తం గురించి సదరు వ్యక్తి ఆరా తీయడంతో అనుమానం వచ్చిన బ్యాంకు సిబ్బంది ఆ చెక్కును పరిశీలించగా అది చెల్లని చెక్కుగా గుర్తించారు. దీంతో ఆ వ్యక్తి వెంటనే అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయాన్ని సిబ్బంది బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై కొండాపురం పోలీసులను వివరణ కోరగా అధికారికంగా ఇంతవరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈ సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖాజీపేట : ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన ఎల్లాల నరసింహులు(45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన అక్కయ్యకు అనంతపురం జిల్లా వెల్లాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన వెల్లాల నరసింహులుతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదుగురు పిల్లలు. వీరు గత కొంతకాలంగా ముత్తులూరుపాడులో నివాసం ఉంటున్నారు. కుటుంబ పోషణ కోసం అక్కడక్కడా అప్పులు చేశారు. అవి తీర్చడం కష్టతరంగా మారింది. దీనికి తోడు కుటుంబంలో వచ్చిన చిన్న చిన్న కలహాల కారణంగా నరసింహులు మద్యానికి బానిసయ్యాడు. తరచూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. పురుగుల మందు తీసుకుని పలుమార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు భార్య తెలిపింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భూమాయపల్లె సమీపంలోని జాతీయ రహదారి బ్రిడ్జి కింద మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ప్రాణాలు వదిలాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య అక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలంటూ మొక్కు


అలిపిరి వద్ద టెంకాయలు కొడుతున్న కాపునాడు నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ 2024లో భారీమెజార్టీతో తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ కాపునాడు ఆధ్వర్యంలో తిరుపతిలోని అలిపిరి మెట్టుమార్గం వద్ద 108 టెంకాయలు కొట్టారు. కాపునాడు అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, వైఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు ఆకులరవి, కావలి కృష్ణతేజ (ఇడుపులపాయ తేజ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కాపునాడు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని తిరుమల మెట్ల వద్ద టెంకాయలు కొట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.హేమలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

పోరుమామిళ్ల : పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనాలకు సంబంధించిన నేరస్తులను పట్టుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలో సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరుకు చెందిన రత్నరాజు, హైదరాబాద్‌కు చెందిన కళ్యాణ్‌కుమార్, బ్రమ్మయ్య, సందీప్ మే నెలలో కాపువీధిలోని ఓబుల్‌రెడ్డి ఇంట్లో, ఆంటోనీస్ స్కూల్ దగ్గర రెండు దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. వీరంతా జైలులో కలుసుకుని ముఠాగా ఏర్పడ్డారన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో కరడుకట్టిన నేరాలు చేసే నిందితులుగా వారిపై కేసులు నమోదయ్యాయన్నారు. హిందూపురం, రాజంపేట, కొమరోలు తదితర ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె సమీపంలోని దూదెమ్మకోన దగ్గర ఉన్నట్లు సమాచారం రావడంతో బుధవారం వారిని సీఐ, ఐడీ పార్టీతో వెళ్లి అదుపులోకి తీసుకున్నారన్నారు. వారినుంచి 10 తులాల బంగారు నగలు, కేజీ వెండి వస్తువులు, హోండా మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇద్దరు మహిళా దొంగలు అరెస్ట్


మహిళా దొంగల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు

కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళా దొంగలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2లక్షలు విలువైన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 42 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ ఎస్.వి.నాగరాజు వివరాలను వెల్లడించారు.

ఈ ఏడాది జనవరి 30న చిత్తూరు జిల్లా విజయపురి మండలానికి చెందిన ముదిరెడ్డి మల్లీశ్వరి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన అత్తగారి ఊరైన పెండ్లిమర్రి మండలం, మర్రిమాకుల పల్లెకు వెళ్లేందుకు కడపకు వచ్చింది. ఆ ఊరికి వెళ్లేముందు తన బిడ్డలకు దుస్తులు కొనేందుకు తన తండ్రితో కలిసి వై.వి స్ట్రీట్‌కు వెళ్లింది. అక్కడ తన బిడ్డల దుస్తుల కోసం షాపింగ్ చేసి, వై.వి స్ట్రీట్‌లో ఉన్న వేపచెట్టు వద్ద తన తండ్రి కోసం వేచి ఉంది. ఇంతలో ఎవరో గుర్తు తెలియని దొంగలు తన భుజానికి ఉన్న బ్యాగ్‌ను కత్తిరించి అందులో ఉన్న 7 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ. 7000 నగదును దొంగిలించుకుని వెళ్లారు. దీంతో ఆమె అదే నెల 31న కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిలో భాగంగా తమకు వచ్చిన సమాచారం మేరకు కడప రాయల్ థియేటర్ సమీపంలో ఉన్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కర్నూలు జిల్లా సిద్ధాంతపురానికి చెందిన తమ్మిశెట్టి వాణి, గుంటూరు జిల్లా బాపట్ల మండలం, అరవపాలెం గ్రామానికి చెందిన గోదారి బుజ్జి ఉన్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన కడప వన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, ఎస్‌ఐ సిద్దయ్య, ఏఎస్‌ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు ఖాదర్, బాషాలను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ సునీల్

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలం రామిరెడ్డి కొట్టాలు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేటకు చెందిన సునీల్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు సునీల్ రాజంపేట నుంచి గుంతకల్లుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రామిరెడ్డి కొట్టాలుకు చెందిన వెంకట శివ కారులో కడప వైపు వెళుతున్నాడు. రామిరెడ్డి కొట్టాలు సమీపంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న సునీల్ తీవ్రంగా గాయపడగా, కారు నడుపుతున్న వెంకట శివ స్వల్పంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను వల్లూరు 108 వాహనంలో చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా అదే సమయంలో కడప నుండి కమలాపురం ప్రయాణిస్తున్న రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను ఆరా తీశారు. క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించారు.